జగనన్న ఇళ్లు.. నెరవేరిన కలలు

- గ్రామాలను తలపిస్తున్న జగనన్న కాలనీలు
- నియోజకవర్గంలో 4,433 ఇళ్ల నిర్మాణాలు పూర్తి


దుప్పలపూడి వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో నిర్మించుకున్న ఇళ్లు

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నవరత్న పథకాలు సంక్షేమ నవశకానికి నాంది పలికాయి. సీఎం జగన్ చేపట్టిన సుదీర్ఘ ప్రజా సంకల్ప పాదయాత్రలో నిలువ నీడ లేకుండా పేదలు పడుతున్న దుర్భర పరిస్థితులను స్వయంగా చూసిన ఆయన అధికారంలోకి రాగానే పేదలందరికీ పక్కా గృహాలు కట్టించి ఇస్తానని మాట ఇచ్చారు. మాట తప్పని, మడమ తిప్పని మనస్తత్వం కలిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ ఇళ్లు పథకానికి శ్రీకారం చుట్టి దేశ చరిత్రలో తొలిసారిగా లక్షలాది మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. అంతటితో ఆగకుండా ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన వనరులు సమకూర్చుతూ ఇళ్లు నిర్మించుకోవడానికి తోడ్పాటును అందించారు. దీంతో పూరి గుడిసెలు, అద్దె ఇళ్ల నుండి నిరుపేదలకు ఉపశమనం లభించింది. ప్రభుత్వ సహకారంతో పేదోడి సొంతింటి కల సాకారమవడంతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. వైఎస్సార్ జగనన్న కాలనీలు కొత్త ఊళ్లను తలపించేలా రూపుదిద్దుకున్నాయి.

పేదలకు స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్లు నిర్మించుకునే స్తోమతలేని వారికి, సొంత స్థలాలు ఉన్నవారికి కూడా ప్రభుత్వం అండగా నిలవడంతో గ్రామాల్లో, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన 70 లేఅవుట్లలో మొత్తంగా 12,741 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించింది. అదేవిధంగా సొంత స్థలాలు ఉన్న వారికి గృహాలు మంజూరు చేసింది. జగన్న లేఅవుట్లలో 8,307 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా ఇప్పటివరకూ 4,433 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేశారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం సుమారు 97.33 కోట్లు ఖర్చు చేసింది.

ప్రభుత్వం తోడ్పాటు

ప్రభుత్వ సహకారంతో ఆశల సౌధాలు రూపుదిద్దుకోవడంతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.1.80 లక్షలు మూడు విడతలుగా అందిస్తోంది. బేస్‌మెంట్, రూఫ్ లెవల్, శ్లాబ్ ఇలా దశలవారీగా నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు నగదు జమచేస్తూ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లిస్తోంది. ప్రభుత్వం మంజూరు చేస్తున్న సొమ్ముకు అదనంగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు మరో రూ.35 వేలు రుణంగా ప్రభుత్వం అందిస్తోంది. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర సౌకర్యాలు కల్పనకు చొరవ చూపుతోంది. ఇప్పటికే అనేక లేఅవుట్లలో పూర్తి స్థాయిలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాల వివరాలు

మండలం	మంజూరైన ఇళ్ల సంఖ్య	బీబీఎల్	బీఎల్	ఆర్ఎల్	ఆర్‌సీ	పూర్తయినవి
అనపర్తి	2,407	465	1,053	94	6	788
బిక్కవోలు	2,608	712	934	36	3	923
రంగంపేట	4,648	2,635	213	87	43	1,670
పెదపూడి	3,078	1,494	434	53	45	1,052

అద్దె ఇళ్లలో చాలా కష్టాలు పడ్డాం



అద్దె ఇళ్లలో ఇంటి అద్దెలు కట్టలేక చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో సొంతిల్లు లేదనే బెంగ తీరింది. జగనన్న కాలనీలో ఇంటి స్థలం రావడంతో అనపర్తి శివారు కొత్తూరులోని జగనన్న లేఅవుట్‌లో ఇల్లు నిర్మించుకున్నాం.

– శ్రీశెట్టి జ్యోతి, అనపర్తి

కల నెరవేరింది



దశాబ్దాలుగా అద్దె ఇంట్లోనే ఉన్నాం. సీఎం జగనన్న దయవల్ల మాకంటూ ఒక సొంతిల్లు సమకూరింది. ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరు చేయడంతో సొంతిల్లు నిర్మించుకుని ఆనందంగా జీవిస్తున్నాం. పేదల సొంతింటి కల సాకారం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– పి.నాగమణి, కొత్తూరు, అనపర్తి

జగనన్నకు రుణపడి ఉంటాం



సీఎం జగనన్న నిరుపేదలకు అండగా నిలుస్తున్నారు. జగనన్న కాలనీలో స్థలం కేటాయించడంతో పక్కా గృహం నిర్మించుకుంటున్నాం. సొంతింటిలో ఉండే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఎస్‌కే ఆయేషా, అనపర్తి కొత్తూరు, అనపర్తి

క్లుప్తంగా

మహిళలకు మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ


మహిళలకు కుట్టు శిక్షణ మెటీరియల్ అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

రంగంపేట: మండల పరిధిలోని వడిశలేరులో మహిళలకు మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ తరగతులు సోమవారం నుంచి ప్రారంభించారు. దివాన్‌చెరువుకు చెందిన డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ప్రారంభించినట్టు మేనేజింగ్ ట్రస్టీలు సుంకర వీరాస్వామి, నాగేశ్వరరావులు తెలిపారు. ఈ సందర్భంగా వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చాలా చోట్ల ఆసక్తి గల వారికి మగ్గం, టైలరింగ్ శిక్షణ అందిస్తున్నామన్నారు. పిల్లలు సెలవుల్లో సెల్‌ఫోన్లకు అలవాటు పడకుండా ఏదో ఒక మోటివేషనల్ క్లాస్ లేదా కొత్త వృత్తి విద్యా నైపుణ్యాలు నేర్చుకోవడానికి సహకరించాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు నాగమణి, కిరణ్, సౌమ్య, అన్నపూర్ణ, మీనా పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ


పందలపాకలో లబ్ధిదారుకు ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న వలంటీర్

బిక్కవోలు: మండలంలో నూతనంగా మంజూరైన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను స్థానిక వలంటీర్లు లబ్ధిదారుల ఈకేవైసీ తీసుకుని సోమవారం పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 22,394 మంది లబ్ధిదారులకు కార్డుల పంపిణీని వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో వలంటీర్లు చేపట్టారు. ఆరోగ్యశ్రీ కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నూతన తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


లతీఫ్ పాషాకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న రెవెన్యూ సిబ్బంది

రంగంపేట: రంగంపేట తహసీల్దార్‌గా లతీఫ్ పాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకూ కృష్ణాజిల్లా కోడూరు మండలంలో పనిచేస్తూ బదిలీపై వచ్చి రంగంపేటలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను డిప్యూటీ తహసీల్దార్ దొరకయ్య, రెవెన్యూ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి సమన్వయంతో పనిచేస్తానని ఆయన తెలిపారు.

రాజానగరానికి కనకరాజు


తహసీల్దార్ కనకరాజును అభినందిస్తున్న సిబ్బంది

రాజానగరం: తహసీల్దార్‌గా జి.కనకరాజు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ సునీత నుంచి బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని ఉండ్రాజవరం నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంతవరకూ ఇక్కడ పనిచేసిన ఎస్.పవన్ కుమార్‌ను గన్నవరానికి బదిలీ చేశారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల వేతన పెంపుపై హర్షం

మధురపూడి: రాష్ట్రంలోని సమగ్ర శిక్ష సిబ్బందికి 11వ పీఆర్‌సీ వర్తింపజేస్తూ, వేతనాలు 23 శాతం పెంచడంపై ఆ సంస్థ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.జాకబ్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లుగా క్రాఫ్ట్, డ్రాయింగ్ విభాగాల్లో పని చేస్తున్నప్పటికీ గత ప్రభుత్వం వేతనాలు పెంచలేదన్నారు. ఈ పరిస్థితుల్లో తమ విజ్ఞప్తుల మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేతనాలు పెంచుతూ ఉత్తర్వులివ్వడం హర్షణీయమన్నారు. సీఎం జగన్‌తో పాటు, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సంప్రదాయబద్ధంగా బండల పండగ

రాజానగరం: మండలంలోని రజకులు సోమవారం బండల పండగను సంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంక్రాంతి అనంతరం కులవృత్తికి కొంత విరామం ఇచ్చి, చాకిరేవు బండలను పూజించిన తదుపరి కొనసాగిస్తుంటారు. పూర్వీకుల నుంచి సంప్రదాయంగా వస్తున్న ఈ ఆచారాన్ని నేటికీ పాటిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పరమేశ్వరుడు కొలువైవున్న పల్లకీని ఊరేగిస్తూ, గరగలతో నృత్యాలు చేశారు. అనంతరం చాకిరేవులకు వెళ్లి బండలకు పూజలు చేశారు. గౌరీ శంకర రజక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాజిమొగ్గల శ్రీను, కోనేటి రామకృష్ణ, మాగాపు భద్రరావు, కోనేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి

బిక్కవోలు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఆయా కుటుంబాలకు కలుగుతున్న మేలును తెలియజేయాలని ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా నూతనంగా ఎండీఓగా బాధ్యతలు తీసుకున్న వి.విజయలక్ష్మిను సభకు పరిచయం చేశారు. అనంతరం అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికను వివరించారు. తొస్సిపూడి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌ఓ తరచూ ఇతరత్రా కార్యక్రమాలకు హాజరవ్వడం వల్ల ప్రజలకు వైద్య సదుపాయం అందడం లేదని ఎంపీటీసీ తేతల సుమ అన్నారు. గతంలో మండలంలో కాకినాడ బాలాజీ చెరువు నుంచి రాయవరం వరకూ మూడు ప్రైవేటు బస్సు సర్వీసులు ఉండేవని, ఇప్పుడవి లేవని సభ్యులు లేవనెత్తారు. అందుకే మండలంలో అదనంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆరికరేవుల అంగన్‌వాడీ కేంద్రం స్లాబ్ వరకూ పని పూర్తయి నిలిచిపోయిందన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళ సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, వైస్ ఎంపీపీ కన్నారావు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం రద్దు

రంగంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం రద్దు చేసినట్టు ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ మాధవీలత ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో మండల పరిషత్ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల కార్యక్రమం చేపట్టినందున సమావేశం రద్దు చేశామన్నారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామన్నారు.

పట్టుదల, గురుభక్తికి నిదర్శనం ఏకలవ్యుడు

- నేటి యువతకు స్ఫూర్తిదాయకం
- కాటవరంలో విగ్రహాన్ని ఆవిష్కరించిన జక్కంపూడి గణేష్


కాటవరంలో ఏకలవ్యుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జక్కంపూడి గణేష్

సీతానగరం: పట్టుదల, గురుభక్తికి నిలువెత్తు నిదర్శనం ఏకలవ్యుడని, నేటి యువత తమ లక్ష్య సాధనలో ఆయన పట్టుదలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. మండలంలోని కాటవరంలో వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు ఆర్థిక సాయంతో ఎరుకుల కాలనీలో ఏర్పాటు చేసిన ఏకలవ్యుడు విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ అసమాన ప్రతిభకు మారు పేరుగా ఏకలవ్యుడు నిలుస్తారన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో ఇప్పటికే నాలుగు సార్లు జాబ్ మేళాలు నిర్వహించి, అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. కొందరు స్కిల్స్ లేకపోవడంతో ఉద్యోగాలు పొందలేకపోతున్నారని, అటువంటి వారికోసం రానున్న రోజుల్లో నియోజకవర్గంలో ఏకలవ్యుడు పేరుతో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ట్రైనింగ్ ఇచ్చే కార్యక్రమం చేపడతామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను అనుగుణంగా రాష్ట్రంలో సీఎం జగన్ పరిపాలన కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ – 2 సత్యం మదన్‌బాబు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, ఉప సర్పంచ్ కోన రామకృష్ణ, ఎంపీటీసీ తాడేపల్లి వెంకట్రావు, మానుపాటి అబ్బులు, గాడ మురళీ, మానుపాటి దుర్గాప్రసాద్, మానుపాటి పుల్లారావు, మానగాని వెంకటేష్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ రథోత్సవ పాదయాత్ర


రాజానగరం చేరిన శ్రీరామ రథోత్సవ పాదయాత్ర

రాజానగరం: కాకినాడ నుంచి భద్రాచలానికి బయలుదేరిన శ్రీరామ రథోత్సవ పాదయాత్ర సోమవారం సాయంత్రం రాజానగరం చేరుకుంది. కాకినాడలోని స్వయంభూ భోగి గణపతి పీఠంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ యాత్ర ప్రారంభమైందని ఈ యాత్రకు సారథ్యం వహిస్తున్న వాసుదేవ గురుస్వామి (ఉంగరాల వీరవెంకట సుబ్బారావు) తెలిపారు. హనుమాన్ దీక్షబూనిన 400 మంది భక్తులు శ్రీరామ రథాన్ని లాగుతూ యాత్రలో పాల్గొన్నారు. 13వ వార్షిక యాత్రగా సాగుతున్న ఈ యాత్ర ఈనెల 13 నాటికి భద్రాచలం చేరుకుంటుందన్నారు. 2012లో పీఠం నుంచి తొలిసారిగా ఇద్దరు భక్తులతో ప్రారంభించామని, నేడు 400 మందికి పైగా పాల్గొంటున్నారన్నారు. దారి పొడవునా భక్తుల సహకారం లభిస్తోందన్నారు. స్థానిక రావుల చెరువు గట్టున ఉన్న కోదండ రామాలయంలో రాత్రికి విశ్రమించి, ఉదయాన్నే తిరిగి యాత్రను కొనసాగిస్తామన్నారు.

ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ


శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మధురపూడి: కోరుకొండ హైస్కూల్లో మూడు రోజులుగా ఉపాధ్యాయులకు ఇస్తున్న ఇన్‌ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ) శిక్షణ సోమవారంతో ముగిసింది. రాజమహేంద్రవరం డివిజన్‌లోని రాజమహేంద్రవరం సిటీ, కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాలకు చెందిన 326 మంది గణితం, పీఎస్, బీఎస్ సబ్జెక్టులకు చెందిన ఉపాధ్యాయలకు ఈ శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, ఎంఈఓ కుశలవదొర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రేపటి తరం భవిష్యత్తు బాగుపడాలన్న లక్ష్యంతో పలు విధాలుగా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. దానిలో భాగమే ఐసీటీ శిక్షణ అన్నారు. ఐఎఫ్ ప్యానల్స్ ద్వారా మరింత విజ్ఞానాన్ని విద్యార్థులు పెంపొందించుకోవచ్చన్నారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ సత్య సురేఖ, మరో ఎంఈఓ ఎం. సుజాత, డీఆర్పీలు ఆంజనేయులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

11న ఆడపడుచుల ఆశీర్వాద సభ

- మహిళా సంక్షేమానికి సీఎం జగన్ ప్రాధాన్యం
- జక్కంపూడి విజయలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలన్నింటినీ మహిళలకే అందిస్తూ, వారి జీవితాలలో వెలుగులు పంచుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయ్యేలా ఆడపడచులందరూ తమ ఆశీసులు అందజేయాలని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. ఇందుకోసం ఈనెల 11వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు రాజానగరంలోని జాతీయ రహదారిని ఆనుకున్న మైదానంలో నిర్వహించే ఆడపడుచుల ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గంలో పార్టీకి అనుబంధంగా ఉన్న మహిళా విభాగాల ప్రతినిధులతో స్థానిక మాధవీ ఫంక్షన్‌హాల్లో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలను కల్పిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. నవరత్నాల పథకాల ద్వారా మహిళల ఆర్థిక ప్రగతికి, మహిళ సాధికారతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మండారపు సీతారత్నం, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు మండారపు వీర్రాజు, కొండపల్లి దుర్గారావు, అడబాల చినబాబు, కుందేటి ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే



అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వెలగపూడి వెళ్లిన ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. సీఎంను కలిసినవారిలో ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి, కోడలు ప్రియాంకలు ఉన్నారు.

కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో శ్రీరామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. డాక్టర్ వై రామచంద్రరావు, డాక్టర్ సత్యం రమేష్‌బాబు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ వైద్యసేవలు అందించారు. శ్రీరామకృష్ణ మఠం శిబిరంలో 276 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి శిబిరంలో 124 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 15 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా ఆపరేషన్ చేసేందుకు ఆసుపత్రికి తరలించారు. మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు (తోటలోరాజు), వలవల కొండలరాయుడు, బోడపాటి సుబ్రహ్మణ్యం తదితరులు భోజనం సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, వై.వెంకట నారాయణ, చంటిబాబు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గిరిజన నృత్యోత్సవం

- నన్నయలో ప్రారంభమైన వేడుక
- అలరించిన నృత్యాలు




డ్యాన్స్ చేస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్ తదితరులు


గిరిజన సాంస్కృతిక ప్రదర్శనలు


గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) జాతీయ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే గిరిజన సంస్కృతి మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన గిరిజన కళాకారులు తమ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ఇచ్చిన ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా అలరించాయి. గిరిజన మహిళల గ్రూప్ డ్యాన్స్, కొమ్ము నృత్యం, తలపై ధరించిన బిందెలతో చేసిన నాట్యాలు అబ్బురపరిచాయి. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సి.సుధాకర్, ప్రిన్సిపాల్ విజయ నిర్మల, ఐఎస్‌టీఎస్ కళాశాల చైర్మన్ ఉపేంద్రరెడ్డివారితో కలిసి నృత్యం చేసి, కళాకారులను మరింత చైతన్యపరిచారు.

రెండు తాటాకిళ్లు దగ్ధం


నల్గొండలో కాలిపోయిన తాటాకిళ్లు

సీతానగరం: మండలంలోని నల్గొండలోని సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఇళ్లలోని ఫ్యాన్లు, టీవీలు, దుస్తులు, మంచాలు, నగదు దగ్ధమయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేసింది. ఈ ఘటనలో సుమారు రూ.4 లక్షల వరకూ ఆస్తినష్టం సంభవించిందని అంచనా. ప్రమాద స్థలాన్ని వీఆర్వో వెంకట్రావు పరిశీలించారు.